ఆటోని పిలిచిందామె. ఇద్దరూ యింటికి చేరుకున్నారు. దీప వారపత్రిక చదువుతోంది. తులసిని చూడగానే ఆత్రుతగా అడిగింది "ఇల్లు దొరికిందా?".

"మీ సంసారం మూడు పగళ్ళూ ఆరు రాత్రులుగా ప్రారంభించవచ్చు. అన్నట్లు దానిక్కూడా ప్రారంభోత్సవం లాంటిదేమయినా ....... ఎందుకంటే రిబ్బన్లు కత్తిరించటంలో నేను ఎక్స్‌పర్ట్‌ని. హైస్కూల్లో మా క్లాస్‌మేట్ నటాషా జడ రిబ్బన్ నేనే కత్తిరించాను."

తులసి త్వరగా తన బట్టలన్నీ సూట్‌కేసుల్లో సర్దేస్తోంది. దీప అతన్ని వదిలించుకోడానికని తులసికి సహాయం చేయసాగింది.

సురేష్ టేబుల్ మీద ట్రాన్సిస్టర్ ఆన్ చేశాడు.

"బిడ్డకూ, బిడ్డకూ మధ్య ఎడం కావాలంటే భార్యాభర్తల మధ్య ఎడం కావాలి" అన్నాడు రేడియో ప్రకటన గొంతుతో.

తులసి నవ్వేసింది.

"అయామ్ రడీ" అందామె సూట్‌కేసులు క్లోజ్ చేసి.

సురేష్ రెండు చేతుల్తో రెండు సూట్‌కేస్‌లూ తీసుకున్నాడు.

"ఒకటి నేను పట్టుకుంటాను" అందామె.

"నో డార్లింగ్! బ్యూటిఫుల్ గాళ్స్‌కి సర్వీస్ చేయటం నా హాబీ" అంటూ బయటకు నడిచాడు.

తులసి కళ్ళల్లో నీళ్ళు నిలిచినయ్ "థాంక్యూ దీపా! ఎంతో హేపీగా గడిపాం. విడిపోవాలంటే ఏమిటోగా వుంది."

"నాకూ ఏమిటోగా వుంది" బాధగా అంది దీప.

సురేష్ సూట్‌కేస్‌లు, ఫోల్డింగ్ కాట్ ఆటోలో పెట్టాడు. తులసి అతని పక్కన కూర్చుంది. ఆటో వెళుతోంటే వింత అనుభూతులు ఆమెను చుట్టుముట్టినయ్.

తనూ, సురేష్ ఈ రాత్రి నుంచి ఒకే ఇంట్లో గడపబోతున్నారు. అతనితో తనకు ఇది మొదటిరాత్రి కాదు. కానీ భార్యాభర్తల్లా కలిసి గడపటం ఇవాళనుంచే ....... ఈ రాత్రి నుంచే మొదలు. తను వూహించుకుంది ఒకటి. జరుగుతోందొకటి. పెళ్ళయ్యాకే ఇలాంటివన్నీ అనుకుంది అప్పట్లో.  ఒకటొకటిగా అన్నీ చేజారిపోయినయ్. పెళ్ళికి కావల్సిన హంగులేమీ లేవు ఇద్దరి దగ్గరా. అందుకే అది నిరవధికంగా వాయిదా పడుతోంది.

సురేష్ ఆమె చుట్టూ చేయి వేసి చటుక్కున దగ్గరకు లాక్కుని ముద్దు పెట్టుకున్నాడు.

"ఏయ్! ఏమిటిది?" కోపంగా అందామె.

అతను ఆశ్చర్యపోయాడు. "ఇంత వయసొచ్చింది, యింకా తెలీదా? దీనిని 'కిస్' అంటారు. ఇంకా పూర్తి వివరాలు చెప్పెయ్యనా?" ఉత్సాహంగ అడిగాడు.

"అక్కరలేదు"

ఆటో గంగాభవాని ఇంటిముందు ఆగింది. గంగాభవాని వాళ్ళ యింటి గడపలోనే నిలబడింది.

"నేను ఆటోలో కూర్చుంటాను. నువ్వూ ఆటో అతనూ సామాను లోపలికి చేరేయండి" అన్నాడు సురేష్.

సామాను చేరవేయటం పూర్తయింది.

"ఫర్వాలేదులే ....... రా" అంది తులసి.

ఆటో దిగి నిలబడ్డాడతను. జేబులోంచి కర్చీఫ్ తీసి చెవులకి చుట్టుకుని, కళ్ళజోడు పెట్టుకుని తులసితో పాటు త్వరత్వరగా ఇంట్లోకి నడిచాడు.

తలుపులు మూసివేశాక గానీ ధైర్యం రాలేదు.

"ఆకలి" అన్నాడు తర్వాత.

"అదేమిటి? ఆకలుండదు దాహముండదు నిన్ను చూస్తూంటే' అనే పాట ఎందుకు రాసినట్లు సినిమావాళ్ళు?"

"అది కొత్త అమ్మాయి దొరికినప్పటి సంగతి."

తులసి అతని చేతిమీద గట్టిగా గిల్లింది నవ్వుతూ.

"ఆ టిఫిన్‌లో దీప ఫలహారం యిచ్చింది. ప్లేట్స్‌లో పెట్టు. నేను ఇంటామెనడిగి మంచినీళ్ళు తెస్తాను."

సురేష్ త్వరత్వరగా ఫలహారం చేస్తుంటే తులసి ట్రాన్సిస్టర్ ఆన్ చేసింది.

నడిరేయి ఏ జాములో స్వామి నినుచేర దిగివచ్చునో పాట.

"యూస్‌లెస్" అన్నాడతను.

"ఏమిటి?"

"నడిరాత్రి వ్యవహారం! బహుశా షిఫ్టు డ్యూటీలు చేసేవాళ్ళ కోసం రాశారేమో?"

"నీకింకో ధ్యాస వుండదు" నవ్వుతూ అంది.

ఫోల్డింగ్ కాట్ అన్‌ఫోల్డ్ అయింది. అతని పక్కనే మంచం మీద కూర్చుంటూ అడిగింది- "ఇల్లు చాలా బాగుంది కదూ?"

"ఇల్లు కాదు ఇంట్లో బాగుంది" ఆమెను కౌగిట్లోకి లాక్కుంటూ అన్నాడు. తులసికి తెలుసు అతని చేతుల్లో తను మైనపుబొమ్మలా నలిగిపోవటం తప్ప వద్దు అనగలిగే శక్తిలేదని. వరుస క్రమంలోనే జరుగుతుందంతా. గుండెమీద చక్కిలిగిలి. వళ్ళంతా ఆవిరి, చెవిలో గుసగుస ఊపిరికి అడ్డంపడే నగ్నత్వం.

"తులసీ!"

“మై లవ్ గాడెస్.”

“సురేష్ ....... ”

“తులీస్!”

తలుపు తట్టిన చప్పుడు. ఎన్నో లోకాలను దాటుకుంటూ వెనక్కు రావాల్సి వచ్చింది.

“ఎవరది?” అడిగాడు సురేష్.

“ఇంత అర్థరాత్రి ఎవరయ్యుంటారు?” అతనిని కప్పివేసిన తన పొడుగాటి జుట్టుని వెనక్కు తీసుకుని ముడి వేసుకుంటూ అంది.

మళ్ళీ తలుపు చప్పుడు.

“నువ్వుండు” అని ఆమె లేచివెళ్ళి తలుపు దగ్గర నిలబడింది.

“ఎవరు”?

“పాలప్యాకెట్”

ఇద్దరికీ ఆశ్చర్యం!

“ఇంత రాత్రా?” తలుపు కొంచెంగా తెరచి చేయి జాపింది తులసి.

“రాత్రేమిటమ్మా ఆరవుతోంది”

తలుపు భళ్ళున మూసుకుంది.

టైం పీస్ చూసి మంచం మీదపడి తల్చుకుని తల్చుకుని నవ్వుతోంది తులసి.

** * **

“తులసిగారూ!”

సురేష్ ముఖం కడుక్కుని కాఫీ తాగుతుంటే హఠాత్తుగా లోపలికొచ్చింది గంగాభవాని. మరుక్షణం నిశ్చేష్టురాలై నిలబడిపోయింది.

“మీరు...నువ్వు.....”

అతను నవ్వాడు. ఆమె ఇప్పుడు గొడవ చేసేది ఖాయం. ఈ లోగానే తను షాక్ ట్రీట్‌మెంట్ యివ్వాలి.

“తులసి బెస్ట్‌గాళ్. మీకు మంచి కంపెనీ. ఆమె ఆఫీసుకెళ్ళినప్పుడు నేనుండనే వుంటాను ఏమంటారు?”.

తులసి వంటింట్లో నుంచి బయటికొచ్చింది.

“నుంచునే వున్నారేం? అలా కూర్చోండి” అందామె.

“మీ భర్త యితనేనని ముందు చెప్పలేదేం?” కోపంగా అడిగిందామె.

“ముందు నేను భర్తయితే గదా! రాత్రే అయ్యాను” అనుకున్న ఎఫెక్ట్ వచ్చింది. షాక్ అయిందామె.

తులసి గిల్లింది నవ్వాపుకుంటూ.

"మీకు మావారు ముందే తెలుసా?" అడిగింది తులసి .... తత్తరపాటు.

"నిన్న ఇంటి కోసం వస్తే యివ్వనని చెప్పాను, మళ్ళీ యీ రకంగా మోసగించటం...."

"ఇవాళ మీ కోసం వచ్చాను. ఇంటి కోసం కాదు" అన్నాడతను కల్పించుకుంటూ.

ఆమె కళ్ళల్లో మళ్ళీ కోపం.

"అంటే... మీకు పరిస్థితంతా చెప్పి ఇంట్లో కొన్ని రోజులయినా వుండేందుకు."

"నాకేమీ తెలీదు. తక్షణం ఇల్లు ఖాళీ చేయాలి."

"చిన్న పాపతో మళ్ళీ ఇంకో ఇంటికి మారటమెలా? నాల్రోజులాగితే..."

ఆమె గదంతా వెతికింది.

"చిన్నపాప ఎక్కడ?"

తులసి పొట్టవైపు చూపాడతను.

"ప్రాక్టీస్ చేస్తున్నాం."

గంగాభవాని మొహం ఇంకా ఎరుపెక్కింది.

"అంతా వట్టిదే" అంది తులసి .

గంగాభవానికి కోపం, నవ్వూ రెండూ వచ్చాయి. కానీ రెండిటినీ కంట్రోల్ చేసుకుంది.

"మీకు సరిగ్గా మాట్లాడటం తెలీదు" అంది కోపం నటిస్తూ.

"ఎంత తీసుకుంటారు?"

"తీసుకోవటమేమిటి?"

"సరిగ్గా మాట్లాడటం నేర్పడానికి. అది వచ్చాక మిగతావి నేర్చుకుంటాను."

నిజంగానే కోపమొచ్చిందామెకి.

"ఇంకోసారిలా మాట్లాడితే బాగుండదు."

విసవిస నడుస్తూ వెళ్ళిపోయింది.

తులసి వంటింట్లోకి నడిచింది. సురేష్ కూరగాయల్ని చాకుతో కోసి యిచ్చాడు.

"నేను స్నానం చేసి వస్తాను. కూర చూస్తూ వుండు."

"నేనూ వస్తాను."

"ఎక్కడికి?"

"స్నానానికి"

"చీ! సిగ్గు లేదూ?" నవ్వాపుకుంటూ అడిగింది.

"ఇంకా పెళ్ళి అవందే?"

బాత్‌రూమ్‌లోకెళ్ళి తలుపు మూసేసుకుంది. బయటికి వచ్చేసరికి ఇద్దరికీ భోజనం రడీ

చేశాడు.

"నా ప్లేట్ ఒక్కటే పెట్టావేంటి? నీ ప్లేట్ ఏది?"

"మూతలో తినేవాడిని."

"చీ! పాడు! ఇప్పుడెలా మరి?"

"నీ ప్లేట్‌లో తిందాం."

"ఇద్దరం ఒకే ప్లేట్‌లోనా?"

"ఒకే బెడ్ మీద ఎడ్జస్టవటంలేదూ?"

అతనిని గట్టిగా గిల్లిందామె. భోజనం అయింది.

అద్దంముందు నిలబడి మేకప్‌కి ఫైనల్ టచెస్ యిస్తోంది తులసి .

"ఇంకేమీ ఇంటర్వ్యూలు లేవా?"

"నీ ఇంటర్వ్యూలు చాలు నాకు."

ఆమె బ్యాగ్ తీసుకుని చెప్పులు వేసుకుంది.

"సాయంత్రం చౌరస్తా దగ్గర వెయిట్ చేస్తున్నావా?"

"సాయంత్రం అయిదు గంటలకల్లా మీ బాస్ నీ చేతులు నిమరటం ఆ పేస్తాడని గ్యారంటీ యిస్తే..."

ఆమె నవ్వేసింది.

"బై" అంటూ అతని దగ్గరకొచ్చి నుదుటి మీద ముద్దు పెట్టుకోబోయింది.

సురేష్ చటుక్కున తల ఎత్తి ఆమె పెదాల మీద ముద్దు పెట్టుకున్నాడు.

అతని నాలుక ఎక్స్‌రేలు తీయటానికి ప్రయత్నిస్తోంది. ఆ తర్వాత ఏం జరుగుతుందో తులసికి తెలుసు. కిందకు జారటం, బిగి కౌగిలి, పక్కకు ఒరగడం, వళ్ళంతా ఆవిరులు, అరమోడ్పు కన్నులు, స్తంభించే గాలి...

"తులసీ!"

"సురేష్!"

"అబ్బ తులసీ!"

చప్పున అతన్ని దూరం తోసివేసింది తులసి .

"నీతో ఇదే తలనోప్పి " అంది మళ్ళీ అద్దం ముందు నిలబడి మేకప్ సరి చేసుకుంటూ.

"అయితే ఆ మహేష్‌గాడి దగ్గరకెళ్ళిపో"

"మహేష్ గురించి అలా మాట్లాడవద్దు- హి ఈజే జంటిల్మన్."

"మరి మీ ఇద్దరూ ఓసారి సినిమా చూస్తున్నప్పుడు వాడు నీ పైట కొంగు...."

"అది ఎడోల్‌సెంట్ ఏజ్ అని ఓసారి చెప్పాను."

"అదే నేననేదీనూ-ఇంత అందమైన అమ్మాయి పక్కనుంటే ఏం చేయాలో తెలీని వెధవని ఎలా లైక్ చేశావా అని...."

"మహేష్ వెధవ కాదు- డెలికేట్ నేచర్."

"అమ్మాయిలకు కావలసింది డెలికేట్ ట్రీట్‌మెంట్ కాదు."

"నువ్వేలా చెప్పగలవ్?"

"వాళ్ళావిడ వారం క్రితం ఓ ఇన్ కంటాక్స్ కుర్రాడితో లేచి పోయింది."

"మైగాడ్!"

"దేవుడయినా సరే డెలికసీ పనికిరాదు."

"నువ్వు చెప్పేది నిజమేనా?"

"అవును. ఆ మధ్య సనత్‌నగర్‌లో కనిపించి చెప్పాడు మహేష్."